సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



ముగిసిన వార్షికోత్సవాలు

చినముషిడివాడలోని శ్రీ శారదాపీఠం వార్షికోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. 8లో



లా విద్యార్థులకు అస్వస్థత!

దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో అధిక సంఖ్యలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. 8లో



మత్స్యాల్లో మహా'రాణి'లు!

ఒకప్పుడు అంతగా డిమాండ్ లేని రాణి ఫిష్ చేపలకు ఇప్పుడు మంచి రోజులొచ్చాయి. 8లో

న్యూస్‌రీల్

నేడు గోవా సీఎం రాక

మహారాణిపేట: గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ బుధవారం విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో సాయంత్రం 6.05 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నోవాటెల్ హోటల్‌కు వెళ్తారు. రాత్రి పోర్టు కళావాణి స్టేడియంలో వివాహ కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి నోవాటెల్‌లో బస చేస్తారు. 2న ఉదయం 10.50 గంటలకు విమానంలో గోవా వెళ్తారు. గోవా రాష్ట్ర మంత్రి కె.రోహన్ పోర్టు స్టేడియంలో జరిగే వివాహ కార్యక్రమంలో పాల్గొంటారు.

రేపు నగరానికి కర్ణాటక లా కమిషన్ చైర్మన్

మహారాణిపేట: కర్ణాటక లా కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎస్.ఆర్.బన్నూరుమఠం ఈనెల 2న విశాఖ వస్తున్నారు. బెంగళూరు నుంచి విమానంలో సాయంత్రం 4.35 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి సబ్బవరం మండలం దామోదర సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ గెస్టు హౌస్‌కు చేరుకొని అక్కడ బస చేస్తారు. 3న ఉదయం 11 గంటలకు జాతీయ న్యాయ సదస్సులో పాల్గొంటారు. 4, 5 తేదీల్లో విశాఖలో ఉంటారు. 6న సాయంత్రం 5 గంటలకు బెంగళూరుకు బయలుదేరుతారు.

3న జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాక

మహారాణిపేట: జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖ శర్మ ఈనెల 3న విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో సాయంత్రం 5.10 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకొని అక్కడ బస చేస్తారు. 4న ఉదయం 9 గంటలకు ఇదే హోటల్‌లో మహిళా ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలతో జరిగే వర్క్‌షాప్‌లో పాల్గొంటారు. 5న సాయంత్రం 5.40 గంటలకు విమానంలో ఢిల్లీకి బయలుదేరుతారు.

ఈపీడీసీఎల్ డైరెక్టర్‌గా రమేష్ ప్రసాద్ కొనసాగింపు



డొండపర్తి(విశాఖ దక్షిణ): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్(ఆపరేషన్స్)గా విధులు నిర్వర్తిస్తున్న బి.రమేష్ పదవీ కాలాన్ని మరో ఏడాది పాటు పొడిగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2020లో ఈపీడీసీఎల్‌లో డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన సేవలను గుర్తిస్తూ 2024 జనవరి వరకు కొనసాగేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో సంస్థ అధికారులు, ఉద్యోగులు, వివిధ యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు



వర్క్‌బుక్స్ పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: ఇసుకతోట ప్రాథమిక పాఠశాలను మంగళవారం డీఈవో ఎల్.చంద్రకళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన వంటి అంశాలపై పరిశీలించారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు అన్ని సబ్జెక్టుల వర్క్‌బుక్స్‌ను జూలై నుంచి ఇప్పటి వరకు ఉపాధ్యాయులు దిద్దకపోవడాన్ని గుర్తించారు. వర్క్‌బుక్స్‌ను తప్పనిసరిగా దిద్దాలని పదే పదే చెబుతున్నా.. నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో టీచర్లపై ఆమె తీవ్ర ఆగ్రహం వక్తం చేశారు. ఇందుకు బాధ్యులుగా పాఠశాల హెచ్‌ఎం జి.వి.నాగమణి, ఉపాధ్యాయురాలు కె.కొండలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు.

'కిల్కారి'తో గర్భిణులకు అవగాహన

మహారాణిపేట: కిల్కారి మొబైల్ అకాడమీ ద్వారా గర్భిణులకు అవగాహన కల్పించనున్నట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశ కార్యకర్తలకు కిల్కారి మొబైల్ అకాడమీపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అకాడమీ ద్వారా గర్భిణులకు సమాచారం అందుతుందన్నారు. మాతా శిశు సంరక్షణ చర్యలు, వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణ, శిశు ఆరోగ్య సేవల గురించి సమాచారం, సలహాలను వాయిస్ రూపంలో డాక్టర్ అనిత తెలియజేస్తారన్నారు. గర్భిణులు 4వ నెల నుంచి కాన్పు అయిన సంవత్సరం వరకు వారానికి ఒకసారి వాయిస్ మెసేజ్ (01244588000) వస్తుందన్నారు. 14423 నంబర్‌కు కాల్ చేసి వాట్సాప్ ద్వారా కూడా వాయిస్ మెసేజ్‌లు పొందవచ్చన్నారు.

వైజాగ్‌కు జై



- రాజధాని విశాఖ అని సీఎం జగన్ ప్రకటన
- త్వరలోనే తాను షిఫ్ట్ అవుతానని స్పష్టీకరణ
- సర్వత్రా ఆనందోత్సాహాలు, జేజేలు
- ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకాలు

సాక్షి, విశాఖపట్నం: మా రాజధాని విశాఖే.. త్వరలోనే సుందరి నగరి రాజధానిగా మారబోతోంది. రాబోయే నెలల్లో నేనూ అక్కడకు మారబోతున్నాను' అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రకటన నగరవాసులను ఆనందడోలికల్లోను, సంభ్రమాశ్చర్యాల్లోను ముంచెత్తుతోంది. మంగళవారం ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ (జీఐఎస్) సన్నాహక సదస్సులో ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులనుద్దేశించి ప్రసంగిస్తూ ఆయన ఈ సంచలన ప్రకటన చేశారు. వాస్తవానికి విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తామని రెండేళ్ల క్రితమే ఆయన అసెంబ్లీ వేదికగా పలుమార్లు చెప్పారు. అయితే వివిధ కారణాలతో జాప్యం జరుగుతూ వస్తోంది. రాష్ట్రంలో మరే నగరానికి లేనంత విశిష్టత, భౌగోళిక స్వరూపం, చారిత్రక నేపథ్యం, రైలు, రోడ్డు, విమాన, సముద్ర రవాణా సౌకర్యాలు, పోర్టులు, ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు విశాఖకు ఉన్నాయి. సౌమ్య స్వభావం కలిగిన ప్రజలు, ఎక్కడి వారినైనా అక్కున చేర్చుకునే నైజం ఇక్కడి వారి సొంతం. ఆదాయం వనరులు పుష్కలంగా ఉన్న, ఏడాది పొడవునా అనుకూలమైన వాతావరణం కలిగిన, ప్రకృతి రమణీయతతో అలారారే అతి సుందర నగరం. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, విద్య, వైద్య రంగాల్లోనూ అభివృద్ధి చెందిన సిటీ విశాఖ. దేశంలో అభివృద్ధి చెందిన టాప్ 10 నగరాల్లో వైజాగ్ ఒకటి. ఇలా ఒకటేమిటి? చెప్పుకుంటూ పోతే పరిపాలన రాజధానికి అవసరమైన అన్ని వనరులూ, విశిష్టతలు, సుగుణాలు ఈ మహా నగరానికి ఉన్నాయంటూ అనేకమంది మేధావులు, విద్యావేత్తలు, వివిధ రంగాల నిపుణులు ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నగర వైశిష్ట్యాన్ని కొనియాడారు.



ఉత్తర నియోజకవర్గంలో సంబరాలు

కొన్నాళ్లుగా ఎదురు చూపులు

విశాఖ రాజధాని ఎప్పుడవుతుందా? అంటూ విశాఖ వాసులే కాదు.. ఉత్తరాంధ్ర ప్రజలు కూడా వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర విశాఖ పరిపాలన రాజధానితో శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ఆశగా ఉన్నారు. కొత్తగా ఈ ప్రాంతంలో మరిన్ని పరిశ్రమలు, ఐటీ సంస్థలు ఏర్పాటై ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయన్న విశ్వాసంతో ఉన్నారు. విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా చేయడం ద్వారా విశ్వసనీయతకు మారుపేరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విశాఖతో పాటు, ఉత్తరాంధ్రను అభివృద్ధి పథంలో నడిపిస్తారన్న ఆశాభావాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

సంబరాలు.. ఆనందోత్సాహాలు..

మంగళవారం సీఎం వైఎస్ జగన్ 'త్వరలో విశాఖ మా రాజధాని' అంటూ చేసిన ప్రకటనతో ఆనంద పరవశులైన నగర వాసులు సంబరాలు జరుపుకున్నారు. కేక్‌లు కట్ చేసుకున్నారు. మిఠాయిలు పంచుకున్నారు. జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేశారు. జై విశాఖ.. జై జగన్.. అంటూ నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి ప్రకటనతో రెండేళ్లుగా ఎదురు చూస్తున్న తమకు ఇక రాజధాని రావడమే తరువాయి అన్న నమ్మకం, సంతోషంతో ఉన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సీతమ్మధార: ఏప్రిల్ నుంచి విశాఖ రాజధానిగా పరిపాలన సాగిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు బర్కత్ ఆలీ, సారిపల్లి గోవింద్, కార్పొరేటర్లు కటారి అనిల్ కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, శశికళ, సీనియర్ నాయకులు బొడ్డేటి కాశీ విశ్వనాథ్, మహ్మద్ ఫరూఖీ, వార్డు అధ్యక్షులు పైడి రమణ, నీలి రవి, రత్నాకర్, రాష్ట్ర డైరెక్టర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రుల్లో ఉత్సాహం



రాష్ట్ర రాజధాని విశాఖపట్నం అని దేశ రాజధాని ఢిల్లీలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం శుభ పరిణామం. త్వరలోనే విశాఖ నుంచి పరిపాలన కొనసాగిస్తామని, తాను కూడా విశాఖకు నివాసం మార్చుకుంటున్నానని ప్రకటించడం ఉత్తరాంధ్ర ప్రజల్లో ఉత్సాహం నింపింది.

– పాకా సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు, వికేంద్రీకరణ పరిరక్షణ వేదిక

పెట్టుబడులు పెరుగుతాయి



పరిపాలన రాజధాని వస్తే విశాఖలో పెట్టుబడుల వేగం ఊపందుకుంటుంది. అన్ని విధాలా ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుంది. మౌలిక వసతులు మరింత పెరుగుతాయి. విమానయాన కనెక్టివిటీ కూడా వృద్ధి చెందుతుంది. రాజధాని అయితే ప్రపంచ దేశాల్లో విశాఖ నగరానికి మరింతగా గుర్తింపు లభిస్తుంది.

– ఆర్‌ఎల్ నారాయణ, చైర్మన్, ఇన్వెస్ట్‌మెంట్ కమిటీ, ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఏపీ

నేటి నుంచి విజయోత్సవాలు



విశాఖ పరిపాలన రాజధాని అయితే ఉత్తరాంధ్ర జిల్లాలు అభివృద్ధి చెందుతాయి. ఉత్తరాంధ్రలో ఉన్న యువత, ప్రజలంతా కోరుకునే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ నుంచి రాష్ట్ర రాజధాని విశాఖే అని ప్రకటించి.. అందరిలోనూ ఉత్సాహం నింపారు. కొన్నాళ్లుగా విశాఖ పరిపాలన రాజధాని కావాలని ఇక్కడి ప్రజలు శాంతియుతంగా కార్యక్రమాలు చేపడుతున్నారు. అఖిలపక్షంతో పాటు ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీతో కలిసి వైఎస్సార్ సీపీ అనేక కార్యక్రమాలు నిర్వహించి.. ప్రజలకు అవగాహన కల్పించింది. బుధవారం నుంచి అన్ని నియోజకవర్గాల్లో పార్టీ తరఫున సంబరాలు నిర్వహిస్తాం.

– పంచకర్ల రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు

వికేంద్రీకరణతోనే అభివృద్ధి సాధ్యం



సుప్రీంకోర్టులో కూడా మూడు రాజధానులకు అనుకూలంగా తీర్పు వస్తుందని భావిస్తున్నాం. రాష్ట్ర పునర్ విభజన చట్టంలో అమరావతినే రాజధాని చేయాలనేది ఎక్కడా లేదు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శివరామకృష్ణన్ కమిటీ పరిపాలన వికేంద్రీకరణతో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని చెప్పింది. రాజ్యాంగపరమైన అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకునే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రమంతా బాగుండాలని ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీ కోరుకుంటోంది. తక్కువ ఖర్చుతో మిగతా రాష్ట్రాల రాజధానులకు దీటుగా విశాఖ అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచైనా పరిపాలన సాగించే అధికారం సీఎంకు ఉంది.

– లజపతిరాయ్, చైర్మన్, ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీ

రాజధానితో మంచి జరుగుతుంది



విశాఖ రాజధానితో ఈ ప్రాంతానికి అంతా మంచే జరుగుతుంది. రాజధానికి కావలసిన అన్ని వనరులు, మౌలిక సదుపాయాలు విశాఖలో ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలూ ఉన్నాయి. రాష్ట్రంలో అభివృద్ధి చెందిన, అందమైన ఏకైక సిటీ విశాఖే. ఇంతటి ప్రశాంతత కలిగిన నగరం దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే ఉండదంటే అతిశయోక్తి కాదు.

– పైడా కృష్ణప్రసాద్, అధ్యక్షుడు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్

యువతకు ఉద్యోగాలు దక్కుతాయి



విశాఖ పరిపాలన రాజధాని అయితే ఉత్తరాంధ్ర వాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరినట్లే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటనతో రాజధాని తరలివస్తుందనే నమ్మకం కలిగింది. పేరొందిన విద్యా సంస్థలు ఇక్కడకు వస్తాయి. యువతకు ఉద్యోగాలు దక్కుతాయి. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం ఉమ్మడి జిల్లాల నుంచి పూర్తిగా వలసలు తగ్గుతాయి. ఈ ప్రాంత వాసులకు ఎంతో మేలు జరుగుతుంది. దీన్ని ప్రతి ఒక్కరూ హర్షించాల్సిందే..

– ఇమంది పైడిరాజు, ఎస్టీయూ రాష్ట్ర కమిటీ కౌన్సిలర్

నవభారత నిర్మాణంలో వర్సిటీలే కీలకం



కార్యక్రమానికి హాజరైన ఉపకులపతులు, అధ్యాపకులు



ఏఐయూ సంచికను ఆవిష్కరిస్తున్న గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్

- పటిష్టమైన ఉన్నత విద్యావ్యవస్థతో అభ్యున్నతి సాధ్యం
- సౌత్‌జోన్ వీసీల సదస్సులో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పిలుపు

ఏయూక్యాంపస్: ఆత్మనిర్భర్ భారత్‌ను సాకారం చేస్తూ.. నవ్యభారతావని నిర్మాతలను తీర్చిదిద్దే బాధ్యతను విశ్వవిద్యాలయాలు స్వీకరించాలని గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పిలుపునిచ్చారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సౌజన్యంతో ఏయూ నిర్వహిస్తున్న సౌత్ జోన్ వైస్ చాన్సలర్స్ మీట్ 2023 'రీసెర్చ్ అండ్ ఎక్సలెన్స్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేటివ్ హయ్యర్ ఎడ్యుకేషన్' సదస్సును గవర్నర్ ప్రారంభించారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన ఉపకులపతులనుద్దేశించి మాట్లాడారు. దేశ అభివృద్ధికి ఉన్నత విద్య ఎంతో ప్రధానమైన అంశం అన్నారు. భవిష్యత్ నాయకులు తయారు చేయడానికి జ్ఞానం, అధునాతన నైపుణ్యాలను అందించడం ద్వారా దేశ నిర్మాణం చేయాలన్నారు. దీని ఫలితంగా బలమైన సామాజిక ఆర్థిక వ్యవస్థను నిర్మించడం వీలవుతుందన్నారు. నూతన విద్య విధానంలో భాగంగా పరిశోధనలకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. పరిశోధన రంగంలో పెట్టుబడులు పెంచాల్సిన అసవరం ఉందన్నారు. ప్రపంచ స్థాయి ర్యాంకింగ్‌లో అత్యుత్తమ స్థానంలో భారతీయ విశ్వవిద్యాలయాలు స్థానం సాధించాలని పిలుపునిచ్చారు.

ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఇక్కడ నెలకొల్పిన టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ 34 స్టార్టప్‌లకు వేదికగా నిలుస్తోందన్నారు. అవంతి ఫీడ్స్‌తో ఏర్పాటు చేసిన స్కిల్ సెంటర్, ఫుడ్ ప్రాసెసింగ్, టెస్టింగ్ ఇంక్యుబేషన్ సెంటర్, ఫార్మా టెస్టింగ్ లేబొరేటరీ, మెడికల్ జెనిటిక్స్ రీసెర్చ్ సెంటర్, టికాన్స్‌తో విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్(ఐసీసీ) ఫోర్ స్టార్ రేటింగ్ సాధించడం గర్వంగా ఉందన్నారు. సెయింట్ లూక్స్ సంస్థతో ఏర్పాటు చేస్తున్న మ్యూజిక్ ప్రొడక్షన్ స్టూడియో, ఐఐఎం విశాఖపట్నంతో నిర్వహిస్తున్న స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, విభిన్న పరిశ్రమల సహకారంతో ఏర్పాటైన 18 చైర్ ప్రొఫెసర్లు, 1000 దాటిన విదేశీ విద్యార్థుల సంఖ్య ఏయూ గర్వకారణమన్నారు.

అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ అధ్యక్షుడు ఆచార్య సురంజన్ దాస్ మాట్లాడుతూ ఉన్నత విద్యను ఆంగ్లంతో పాటు స్థానిక భాషల్లో అందించాల్సిన అవసరాన్ని వివరించారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నత విద్యలో ప్రవేశాల జీఈఆర్‌ను 27.4 నుంచి 37.2 శాతానికి వృద్ధి చేసినట్లు చెప్పారు. హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏఐయూ సెక్రటరీ జనరల్ డాక్టర్ పంకజ్ మిట్టల్ మాట్లాడుతూ 98 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఏఐయూలో 924 విశ్వవిద్యాలయాలు సభ్యత్వం కలిగి ఉన్నాయన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.పి సిసోడియా, ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు కె.రామ్మోహనరావు, ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సదస్సు నిర్వాహకులు ఆచార్య కె.రాంజీ, ఆచార్య బి.మోహన వెంకట రామ్, ఆచార్య జేమ్స్ స్టీఫెన్, డాక్టర్ ఎస్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వర్సిటీ, ఏఐయూ తరఫున గవర్నర్‌కు జ్ఞాపికలు బహూకరించారు. ఏయూ సంగీత విభాగం విద్యార్థులు నృత్య ప్రదర్శనతో ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు.

డిజిటల్ తాళపత్రాల ఆవిష్కరణ

డాక్టర్ వి.ఎస్.కృష్ణ గ్రంథాలయంలోని 2.16 లక్షల తాళపత్రాలను డిజిటలైజేషన్ చేశారు. వీటిని గవర్నర్ బటన్ నొక్కి ప్రారంభించారు. ఏయూ వద్ద 1,109 మంది అందించిన 2.62 లక్షల తాళపత్రాలు ఉండగా.. రెండేళ్లుగా 2.16 లక్షల తాళపత్రాలను డిజిటలైజేషన్ చేస్తున్నారు. సంస్కృతం, తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం, బెంగాలీ, ఒరియా తదితర భాషల్లో ఉన్న ఈ తాళపత్రాల జ్ఞానం అన్ని విశ్వవిద్యాలయాల విద్యార్థులు వినియోగించుకునే అవకాశం కల్పించారు.

తాంబరం-షాలిమార్ మధ్య స్పెషల్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): దక్షిణ భారతదేశంలో గల వలస కూలీల సౌకర్యార్థం షాలిమార్-తాంబరం మధ్య వీక్లీ స్పెషల్ రైళ్లు నడిపేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే నిర్ణయించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు.

షాలిమార్-తాంబరం(08041) వీక్లీ స్పెషల్ ప్రతి గురువారం షాలిమార్‌లో మధ్యరాత్రి 11.50 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 8.43 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 8.45గంటలకు బయల్దేరి శనివారం మధ్యాహ్నం 2.45 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఈ రైలు ఈనెల 2వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో తాంబరం-షాలిమార్ (08042) వీక్లీ స్పెషల్ తాంబరంలో ప్రతి శనివారం రాత్రి 7 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 12.10 గంటలకు బయల్దేరి సోమవారం ఉదయం 7.40గంటలకు షాలిమార్ చేరుకుంటుంది. ఈ రైలు ఈనెల 4వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నడుస్తుంది.

ఈఎన్‌సీలో పుస్తక ప్రదర్శన

డొండపర్తి(విశాఖ దక్షిణ): ఐఎన్ఎస్ సర్కార్స్ ఆధ్వర్యంలో తూర్పు నావికాదళం రిఫరెన్స్ లైబ్రరీలో మంగళవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. వివిధ రచయితలు, రిటైలర్లకు సంబంధించిన 800 పుస్తకాలతో పాటు లైబ్రరీలో ఉన్న సుమారు 37 వేల పుస్తకాలను ప్రదర్శించారు. నేవీ అధికారులు సైలర్లు, డిఫెన్స్ సివిలియన్లు, వారి కుటుంబ సభ్యులు ఈ ప్రదర్శనను తిలకించారు.

నేడే మహా కౌన్సిల్


చర్చకు రానున్న వందకు పైగా అంశాలు



డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సమావేశంలో 15 సాధారణ అంశాలు, 89 అనుబంధ(సప్లిమెంటరీ) అంశాలతో పాటు మరి కొన్ని టేబుల్ అజెండా అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు వచ్చే అవకాశం ఉంది. వీటిలో ప్రధానంగా జీ-20 సదస్సు, వైజాగ్ టెక్ సమ్మిట్, గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ వంటి శిఖరాగ్ర సమావేశాల దృష్ట్యా నగర సుందరీకరణ, ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, హాట్‌మిక్స్ పద్ధతిలో బీటీ రోడ్లు, బీచ్‌ల సుందరీకరణ తదితర అంశాలపై చర్చించనున్నారు. గత కౌన్సిల్ సమావేశంలో వాయిదా పడ్డ అంశాలపై కూడా చర్చ సాగనుంది. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో 35వ వార్డులో సర్దార్ వల్లభాయ్ పటేల్ మార్కెట్(పూర్ణా మార్కెట్), ముడసర్లోవ పార్కు అభివృద్ధి చేసే అంశం ఆమోదానికి సభ్యులు చర్చించనున్నారు. జీ-20 సమావేశం నేపథ్యంలో జోన్-5 పరిధిలో 41, 51, 53, 54, 55వ వార్డుల మీదుగా ఎన్‌హెచ్-16 కూడలి నుంచి తాటిచెట్లపాలెం కూడలి మీదుగా రైల్వేక్లబ్ కూడలి వరకు రోడ్లకిరువైపులా సుందరీకరణ, జ్ఞానాపురం హిందూ శ్మశానవాటిక నుంచి రైల్వేస్టేషన్ మీదుగా తెలుగుతల్లి వంతెన వరకు ఉన్న రహదారులపై థెర్మోప్లాస్టిక్ రోడ్డు మార్కింగ్ పెయింటింగ్, జీబ్రా క్రాస్ పెయింటింగ్, స్టడ్స్ ఏర్పాటు, తారురోడ్డు మరమ్మతులు, ఫుట్‌పాత్ నిర్మాణాల విషయమై చర్చిస్తారు. చినముషిడివాడ కూడలి నుంచి పెందుర్తి కూడలి వరకు, ఎన్ఏడీ కూడలి నుంచి గోపాలపట్నం కూడలి వరకు, గోశాల కూడలి నుంచి అడవివరం వరకు, గోపాలపట్నం నుంచి పెందుర్తి వరకు వేపగుంట నుంచి చినముషిడివాడ వరకు, గోపాలపట్నం పెట్రోల్ బంక్ నుంచి వేపగుంట కూడలి వరకు హాట్‌మిక్స్ పద్ధతిపై బీటీ రహదారులు పునరుద్ధరణ అంశం చర్చకు రానుంది. నోవాటెల్ హోటల్ పరిసర ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి, సుందరీకరణ, నెక్సాస్ కార్ల షోరూం నుంచి పందిమెట్ట జంక్షన్ వరకు, నౌరోజీ రోడ్డు నుంచి గ్యాస్ గొడౌన్, నేవీ హౌస్ కూడలి వరకు బీటీ రెన్యువల్ లేయర్ వేస్తూ, ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, కొత్త ఫుట్‌పాత్ నిర్మాణాలు చేపట్టేందుకు చర్చించనున్నారు. పెదగంట్యాడలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో నైపుణ్య విద్యా సంస్థ ఏర్పాటుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అమరావతి పేరిట భూ బదలాయింపునకు సంబంధించి కార్పొరేషన్ ఆమోదానికి చర్చకు రానుంది. వీటితో మరిన్ని అంశాలు సభ్యులు చర్చించి ఆమోదం తెలపనున్నారు.

మెడికల్ ల్యాబ్‌లను తనిఖీ చేయండి

అధికారులకు జేసీ ఆదేశం



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: సచివాలయాల పరిధిలోని మెడికల్ ల్యాబ్ లైసెన్స్‌లను తనిఖీ చేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లాస్థాయి కన్స్యూమర్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సమావేశం జరిగింది. నగరంలోని మెడికల్ ల్యాబ్‌లలో సరైన ప్రమాణాలు లేవని, ల్యాబ్‌కి ల్యాబ్‌కి మధ్య నివేదికల్లో వ్యత్యాసం ఉంటోందని, ధరలు కూడా అధికంగా వసూలు చేస్తున్నారని కన్స్యూమర్స్ ఆర్గనైజేషన్ సభ్యులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ల్యాబ్‌లను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. గ్యాస్ సిలిండర్లు డెలివరీ సమయంలో డెలివరీ బాయ్స్ డబ్బులు వసూలు చేసినట్లయితే ఫిర్యాదు చేయాలన్నారు. కల్తీ నూనెలు విక్రయించడం, వినియోగించినట్లయితే చర్యలు తీసుకోవాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. అక్రమ జీఎస్టీ వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. తమ హక్కులపై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. రైతు బజార్లు, కిరాణా దుకాణాల్లో తూకం సక్రమంగా ఉండాలని.. లేకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు. వస్తువుల కొనుగోలులో సమస్యలుంటే.. తెల్ల కాగితంపై రాసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమావేశంలో డీఎస్‌వో సూర్యప్రకాష్‌రావు, ఫుడ్ సేఫ్టీ కంట్రోల్, హెల్త్, జీవీఎంసీ, ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

డీఎస్ఎన్ఎల్‌యూ విద్యార్థులకు అస్వస్థత!



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



విద్యార్థులను హాస్పటల్స్‌కు తరలిస్తున్న వర్సిటీ అంబులెన్స్

- ఫుడ్‌పాయిజన్, కలుషిత నీరే కారణమని విద్యార్థుల ఆరోపణ
- సబ్బవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 66 మందికి వైద్య పరీక్షలు
- సబ్బవరంతో పాటు పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో మరింత మందికి చికిత్స!
- సీజనల్ జ్వరాలేనని వర్సిటీ అధికారుల ప్రకటన

సబ్బవరం: మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో అధిక సంఖ్యలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. సబ్బవరంలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రులతో పాటు విశాఖలోని అపోలో ఆస్పత్రిలో పలువురు విద్యార్థులు చికిత్స పొందుతున్నారు. విద్యార్థులు నాలుగు రోజులుగా వైద్యులను ఆశ్రయించి వైద్యం పొందుతున్నట్లు తెలుస్తోంది. అస్వస్థతకు గురైన వారు సుమారు 100 మంది వరకూ ఉంటారని విద్యార్థులు చెబుతున్నారు. వర్సిటీలో తాగునీరు కలుషితం కావడం, ఫుడ్‌పాయిజన్ వల్ల అస్వస్థతకు గురైనట్టు పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు ఉపకులపతి కార్యాలయం ఎదురుగా మంగళవారం పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

నీటి కలుషితం, ఫుడ్‌పాయిజన్ కాలేదు

విశ్వవిద్యాలయంలో ఏ విధమైన నీటి కాల్యుష్యం, ఆహారం విషపూరితం కాలేదని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏ విద్యార్థి అనారోగ్యంతో ఆస్పత్రిలో లేరన్నారు. ఇద్దరు విద్యార్థులు మాత్రం ఇతర కారణాలతో హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారన్నారు. వర్సిటీ డాక్టర్ ఇచ్చిన వివరణ ప్రకారం కొద్ది మంది విద్యార్థులు సీజనల్ జ్వరాలతో బాధపడుతున్నారన్నారు.

వర్సిటీని సందర్శించిన ఎమ్మెల్యే

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మంగళవారం సాయంత్రం విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులంతా తాగునీరు కలుషితం కావడం, ఆహారం విషపూరితం కావడం వల్లే అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. దేశం నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చి చదువుకుంటున్నామని.. అస్వస్థతకు గురై ఆరోగ్యం బాగోలేకపోవడంతో పాటు భాష, పరిస్థితులు వేరుకావడంతో భయాందోళన చెందుతున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. విశాఖలోని అపోలో ఆస్పత్రిలో సీరియస్‌గా ఉన్న ముగ్గురు విద్యార్థులు చికిత్స పొందుతున్నారన్నారు. దీనిపై ఇప్పటికే ఆర్డీవో, డీఎంహెచ్‌వో, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి డీఎంహెచ్‌వో హేమంత్ కూడా వర్సిటీని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.

66 మందికి వైద్య పరీక్షలు

ఎమ్మెల్యే అదీప్‌రాజ్ స్థానిక పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్సిటీలో వైద్య శిబిరం నిర్వహించి 66 మంది విద్యార్థులకు వైద్యం అందించామన్నారు. 60 మందికి సీజనల్ జ్వరాలు, ఇద్దరు విద్యార్థులకు టైఫాయిడ్, ఇద్దరు విద్యార్థులకు డయేరియా కాగా మరో ఇద్దరు విద్యార్థులకు కడుపునొప్పిగా గుర్తించామన్నారు. ఆహారం, వాటర్ శాంపిల్స్ సేకరించి రీజనల్ ల్యాబ్‌కు పంపించామన్నారు. బుధవారం కూడా వర్సిటీలో మరోసారి వైద్య శిబిరం నిర్వహించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. దీనిపై సమగ్రంగా నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేయాలని తెలిపారు. అనంతరం పరిస్థితిపై వర్సిటీ రిజిస్ట్రార్‌తో ఆయన కొంతసేపు చర్చించారు. ఎమ్మెల్యేతో జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు ఉన్నారు. ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ బి.సత్యనారాయణ, సీఐ రంగనాథం తదితరులు విద్యార్థులను మంగళవారం పరామర్శించారు. విద్యార్థుల సమస్యపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వో, ఆర్డీవోలకు ఫిర్యాదు చేశామన్నారు.

ముగిసిన శారదాపీఠం వార్షికోత్సవాలు

- పీఠాన్ని సందర్శించిన గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్
- మహా పూర్ణాహుతిలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి బొత్స దంపతులు



స్వామీజీల ఆశీస్సులు తీసుకుంటున్న వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి, అదీప్‌రాజ్



పూర్ణాహుతిలో పాల్గొన్న మంత్రి బొత్స దంపతులు

సింహాచలం: చినముషిడివాడలోని శ్రీ శారదాపీఠం వార్షికోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. వార్షికోత్సవాలు పురస్కరించుకుని ఐదు రోజులుగా పీఠంలో రాజశ్యామల అమ్మవారి యాగం, టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాస చతుర్వేద హవనం శాస్త్రోక్తంగా జరిగాయి. ఆయా యాగశాలల్లో మహా పూర్ణాహుతి ఘట్టాలను పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో పండితులు నిర్వహించారు.

అలాగే రెండు రోజులుగా జరుగుతున్న శ్రౌత, శాస్త్ర మహా సభలు విశేషంగా ముగిశాయి. శాస్త్ర సభలో ప్రతిభ కనబరిచిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రికి వ్యాకరణ భాస్కర బిరుదును బహూకరించి.. స్వర్ణకంకణధారణ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, తెలంగాణ కంపెనీస్ లా ట్రిబ్యునల్ న్యాయమూర్తి బద్రీ నారాయణ దంపతులు, భీమిలి, పెందుర్తి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎన్నికల పరిశీలకుడు శరగడం చిన అప్పలనాయుడు తదితరులు మహాపూర్ణాహుతిలో పాల్గొన్నారు. రాజశ్యామల అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం వై.వి.సుబ్బారెడ్డి దంపతులు పీఠాధిపతుల ఆశీస్సులు తీసుకున్నారు. పీఠం ప్రాంగణంలోని మేధా దక్షిణామూర్తి, అభయాంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. కలెక్టర్ మల్లికార్జున, సీపీ శ్రీకాంత్ పీఠానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

రాజశ్యామల అమ్మవారికి గవర్నర్ పూజలు

వార్షికోత్సవాల ముగింపులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ శారదాపీఠానికి విచ్చేశారు. రాజశ్యామల అమ్మవారికి పూజలు నిర్వహించారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకున్నారు.

ఆర్మీ జవాన్ ఆత్మహత్య



ఆర్మీ జవాన్ సురేష్ (ఫైల్)

ఆనందపురం: మండలంలోని లొడగలవానిపాలెం పంచాయతీ నేళ్తేరు గ్రామానికి చెందిన బంక సురేష్ (28) అనే ఆర్మీ జవాను మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇటీవల సెలవుపై ఇంటికి వచ్చిన ఆయన అప్పులు బాధకు తాళలేక అఘాయిత్యానికి పాల్పడ్డాడని గ్రామస్తులు చెబుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బంక అప్పలరాజు, నాగమణిలకు, వరలక్ష్మి అనే కుమార్తె, సురేష్ అనే కుమారుడు ఉన్నారు. సురేష్ ఇంటర్మీడియట్ చదువుకొని ఆరేళ్ల క్రితం ఆర్మీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. 2021లో మండలంలోని బంటుబిల్లి కళ్లాలకు చెందిన సంధ్యను వివాహం చేసుకున్నాడు. వారికి ప్రస్తుతం ఏడాది పాప ఉంది. సురేష్ ప్రస్తుతం పంజాబ్‌లో ఆర్మీ జవానుగా పనిచేస్తున్నాడు. కాగా తండ్రి అప్పలరాజు ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో సురేష్ తనకున్న ఆరు సెంట్లు భూమిని విక్రయించి మరి కొంత సొమ్ము అప్పు చేసి గ్రామంలోనే సొంత ఇల్లు నిర్మించుకున్నాడు. అప్పటి నుంచి భార్య, తల్లి, కుమార్తెను నేళ్తేరులోని సొంత ఇంటిలో ఉంచి సురేష్ ఉద్యోగం చేసుకుంటూ సెలవులకు ఇంటికి వస్తూ వెళ్తున్నాడు. ఇదిలా ఉండగా సురేష్ 15 రోజుల క్రితం సెలవుపై నేళ్తేరు వచ్చాడు. మంగళవారం ఉదయం లేచిన వెంటనే బైక్‌పై బయటకు వెళ్లాడు. అనంతరం భార్యకు ఫోన్ చేసి టిఫిన్ తయారు చేయమని చెప్పాడు. టిఫిన్ తయారు చేసిన సంధ్య భర్త సురేష్ ఫోన్‌కు కాల్ చేయగా లిఫ్ట్ చేయలేదు. పలు మార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అతని స్నేహితుడైన అప్పలరాజుకు విషయం తెలియజేసింది. ఈ మేరకు అతను మరికొంతమంది గాలించగా మధ్యాహ్న సమయంలో గ్రామ శివారు యర్ర చెరువు పక్కన ఉన్న గెడ్డలో సురేష్ మృతదేహాన్ని గుర్తించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మృతదేహానికి సమీపంలో మోనోక్రోన్ పురుగులు మందు డబ్బా ఉండగా స్వాధీనం చేసుకున్నారు. భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ పైడిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాదక ద్రవ్యాలతో పెను ప్రమాదం

- బాలలు బానిసలు కాకుండా చర్యలు
- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు



కమిషన్‌కు విద్యాశాఖపై వివరిస్తున్న డీఈవో చంద్రకళ

ఎంవీపీకాలనీ: బాలల బంగారు భవిష్యత్‌కు ఆటంకంగా మారుతున్న మాదక ద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించే దిశగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆదేశించారు. కమిషన్ సభ్యుడు గొండు సీతారాంతో కలసి మంగళవారం నగరంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖలతో మాదక ద్రవ్యాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. విశాఖపట్నంలో విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలు కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసి, తరచూ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. నగరానికి ఎక్కడ నుంచి డ్రగ్స్ వస్తున్నాయనే అంశంపై నిఘా పెంచాలని పోలీసు శాఖకు సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని, ఇందులో తల్లిదండ్రులు, సంబంధిత అధికారులను భాగస్వాములు చేయాలన్నారు. వచ్చే వేసవి సెలవుల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. మద్యం దుకాణాలు, బార్లలో బాలలు పనిచేయకుండా ఎక్సైజ్ శాఖ దృష్టి పెట్టాలని, దుకాణాల వద్ద ఇదే విషయమై బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. సోషల్ వెల్ఫేర్ జేడీ డి.వి.రమణ మూర్తి, డీఈవో ఎల్.చంద్రకళ, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రాధ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసులు, జెడ్పీ సీఈవో పి.శ్రీరామ్మూర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఉమావతి, ఎన్జీవో ప్రతినిధి సన్యాసరాజు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మత్స్యాల్లో మహా'రాణి'లు!

- స్థానిక మార్కెట్లో గులివిందలుగా పేరు
- ఇతర రాష్ట్రాల్లో రాణి ఫిష్..
- గణనీయంగా పెరిగిన ధర.. లభ్యత
- గతంలో కిలో రూ.50.. నేడు రూ.100కి పైనే
- చెన్నై, కేరళలకు ఊపందుకున్న ఎగుమతులు
- మురిసిపోతున్న మత్స్యకారులు



రాణి ఫిష్ (గులివిందలు)

సాక్షి, విశాఖపట్నం : ఒకప్పుడు అంతగా డిమాండ్ లేని రాణి ఫిష్ చేపలకు ఇప్పుడు మంచి రోజులొచ్చాయి. స్థానిక మార్కెట్లో గులివిందలుగా పిలిచే ఈ చేపలు అధిక డిమాండ్, ధరలతో కొన్నాళ్లుగా మహారాణులయ్యాయి. మత్స్యకారులకు కాస్త ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి. లేత ఎరుపు, పసుపు, తెలుపు, బంగారు, నీలి రంగుల చారలతో కంటికి ఒకింత ఇంపుగా కనిపించే ఈ చేపలకు చెన్నై, కేరళ రాష్ట్రాల్లో లొట్టలేసుకుని తింటారు. అరేబియా సముద్రంకంటే బంగాళాఖాతంలో లభించే ఈ చేపలకు రుచి ఎక్కువ. అందువల్ల తమిళనాడు, కేరళ ప్రాంతాల ప్రజలు వీటిని ఎక్కువగా ఇష్టపడతారు. ఒడిశాలోని చిలక ప్రాంతం నుంచి మన రాష్ట్రంలోని కాకినాడ వరకు వీటి లభ్యత అధికంగా ఉంటుంది. నవంబరు నుంచి ఏప్రిల్ వరకు మత్స్యకారులకు సముద్రంలో ఇవి పెద్ద సంఖ్యలో లభ్యమవుతాయి. గతంలో చెన్నై, కేరళల నుంచి వర్తకులు విశాఖపట్నం వచ్చి వీటిని కొనుగోలు చేసి తమ ప్రాంతాలకు ఎగుమతి చేసుకునే వారు. అప్పట్లో ఇక్కడ కిలో రూ.50కి మించి కొనుగోలు చేసే వారు కాదు. అక్కడ కిలో రూ.100కు పైగా విక్రయించుకునే వారు. పైగా ఈ ప్రాంతంలో వీటికి అంతంతమాత్రపు ధరే లభించేది. కానీ కొన్నాళ్లుగా వీటికి మహా రాణి యోగం పట్టింది. కొంతమంది స్థానిక వర్తకులు ఈ రాణి చేపలను ఇక్కడ నుంచి నేరుగా చెన్నై, కేరళలకు ఎగుమతులు చేస్తున్నారు. అక్కడ కిలో రూ.130 వరకు అమ్ముతున్నారు. దీంతో ఇక్కడ రాణి ఫిష్‌కు అనూహ్యంగా మంచి ధర లభిస్తోంది. ఇలా ప్రస్తుతం వీటిని ట్రేడర్లు కిలో రూ.100 వరకు కొనుగోలు చేస్తున్నారు. వీటిలో పెద్ద సైజు రాణి ఫిష్‌ను కిలో రూ.200 ధర కూడా పలుకుతోంది. ఇలా గతంలో అక్కడ అమ్మకం చేసే ధరే దాదాపు ఇక్కడ వస్తోంది. అసలే వేట గిట్టుబాటు కాక సతమతమవుతున్న మత్స్యకారులు, బోటు యజమానులకు గులివిందల ధర లాభదాయకంగా ఉంటోంది. ఇది మత్స్యకారులకు ఊరటనిస్తోంది. 'డీజిల్ ధర కొన్నాళ్లుగా మాకు పెను భారంగా మారింది. ఈ తరుణంలో సమృద్ధిగా లభ్యత, మంచి ధరతో గులివందలే ఆదుకుంటున్నాయి.' అని మైలపిల్లి రాము అనే బోటు యజమాని 'సాక్షి'తో చెప్పారు.

రోజుకు 25–30 టన్నుల రాణి ఫిష్‌లు

విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు రోజుకు సగటున 150 టన్నుల చేపలు వస్తుంటాయి. వీటిలో ప్రస్తుతం రాణి ఫిష్ (గులివిందలు) చేపలు 25–30 టన్నుల వరకు ఉంటున్నాయి. వీటిలో కొనుగోళ్లు చేయగా మిగిలిన చేపలను కొన్ని రోజులపాటు ఎండబెట్టిన తర్వాత విక్రయిస్తారు.

'రైటర్ పద్మభూషణ్' నచ్చేస్తాడు

హీరో సుహాస్



మీడియాతో మాట్లాడుతున్న రైటప్ పద్మభూషణ్ హీరో సుహాస్

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): లైబ్రరీలో పని చేసే ఓ మధ్య తరగతి యువకుడు రచయిత అవ్వాలనుకోవడమే రైటర్ పద్మభూషణ్ చిత్ర కథ అని హీరో సుహాస్ చెప్పారు. చాయ్ బిస్కట్ ఫిల్మ్స్ పతాకంపై నిర్మించిన రైటర్ పద్మభూషణ్ ప్రమోషన్‌లో భాగంగా.. చిత్ర యూనిట్ మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా సుహాస్ మాట్లాడుతూ ఈ సినిమా ఈ నెల 3న విడుదలవుతుందన్నారు. విజయవాడ, గుంటూరు, కాకినాడ, భీమవరం, విశాఖ ప్రాంతాల్లో ప్రీమియర్ షోలకు మంచి స్పందన వచ్చిందన్నారు. కలర్ ఫొటో సినిమా నచ్చిన వాళ్లకు ఈ సినిమా కూడా నచ్చుతుందన్నారు. సమావేశంలో హీరోయిన్ టీనా, మిగతా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీకి నోటీసులు

మద్దిలపాలెం: ఎన్టీపీసీకి ఏపీ కాలుష్య నియంత్రణ మండలి నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోపు సమాధానం ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొంది. బట్టు సతీష్‌రెడ్డి దాఖలు చేసిన కేసులో ఎన్‌జీటీ ఆదేశాల మేరకు గాలి, నీరు, కాలుష్యంపై కాలుష్య నియంత్ర మండలి పరీక్షలు జరిపింది. ఎన్టీపీసీ నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు తేల్చి ఈ మేరకు నోటీసులు జారీ చేసింది.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఆర్ఐవో

విశాఖ విద్య : ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు కేంద్రాలుగా గుర్తించే క్రమంలో ఆర్ఐవో ఆర్.సత్యనారాయణ మంగళవారం నగరంలోని పలు కాలేజీలను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగినన్ని పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని కాలేజీల ప్రిన్సిపాళ్లకు సూచించారు. కాలేజీల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపరుచాలన్నారు. విశాఖ నగరంలోనే ఎక్కువ సంఖ్యలో కాలేజీలు ఉన్నందున అవసరమైన పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసేలా తగిన కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఆయన వెంట కార్యాలయ పర్యవేక్షకులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీస్ కోఆర్డినేటర్లతో సమావేశం

దొండపర్తి(విశాఖ దక్షిణ): మహిళా పోలీస్ విధులపై డీసీపీ(క్రైం) జి.నాగన్న మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో మహిళా పోలీస్ కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దిశ ఏసీపీ సిహెచ్.వివేకానంద, దిశ సీఐ జి.నిర్మల ఆధ్వర్యంలో మహిళ పోలీసులు చేయాల్సిన విధులను వివరించారు.

పత్రాల్లేకుండా పట్టుబడిన రూ.35 లక్షలు ట్రెజరీకి తరలింపు

సీతమ్మధార: ఎటువంటి పత్రాలు లేకుండా ప్రైవేట్ ట్రావెల్ బస్సులో తరలిస్తున్న రూ.35లక్షలను ఫోర్త్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకుని.. ఆ సొమ్మును ట్రెజరీలో భద్రపరిచారు. దీనిపై కేసు నమోదు చేసిన ఫోర్త్ సీఐ శ్రీనివారావు దర్యాప్తు చేస్తున్నారు. మండల మేజిస్ట్రేట్ పేర్ల శ్యాంప్రసాద్ ఎదుట నగదు తరలిస్తున్న కరణ్‌సింగ్, మణిపాల్ సింగ్‌ను హాజరుపరిచారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలని.. అప్పటి వరకు ట్రెజరీ కార్యాలయంలో నగదు భద్రపరచాలని మేజిస్ట్రేట్ పోలీసులను ఆదేశించారు. దీంతో రూ.35 లక్షలను ట్రెజరీలో భద్రపరిచామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.